# విధ్వంస సౌందర్యం

అజంతా ఎల్లోరా చూడాలన్న కోరిక ఏనాటిదో ! మన దేశం ప్రపంచ దేశాల్లో గర్వంగా తలెత్తుకుని నిలబడడానికి కారణమైన అద్భుతమైన శిల్ప సంపద, అపూర్వమైన చిత్రకళా నైపుణ్యం కలగలిసిన ప్రదేశం కావడమే దానికి కారణం. ఎంత గొప్ప సంస్కృతి మనది! గర్వంతో గుండె అరంగుళం పొంగింది.

బస్ కుదుపులు . . . ఆలోచనలు అవిశ్రాంతంగా . . . నేను చూసిన మనోహరమైన ప్రదేశాలు గుర్తొస్తున్నాయి. రాతిని మైనపుముద్దలా చేసి అతి సుందరమైన శిల్పాలుగా చెక్కిన కోణార్క సూర్య దేవాలయం – అదరహో అనుకునేలా అబ్బురపరచే ఖజురహో అందాలు – అమర శిల్పి జక్కన్న ఉలి అలికిడికి ఉలికులికి ఒయ్యారాల్ని ఒలకబోసిన కులుకుల శిల్ప సుందరీమణుల అపురూప మందిరం బేలూరు – హలెబీడు . . .

ఏమైనా కుడ్య చిత్రాల సోయగం అజంతాలో తప్ప మరెక్కడా కానరాదు. హిస్టరీ లెక్చరర్‌గా ఉద్యోగం నా ప్రవృత్తికి తగిందే.

ఔరంగాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలు, ఎల్లోరా గుహలు చూశాక అజంతా చూడడం కోసం బస్‌లో బయల్దేరాను.

అజంతా గుహల్లోని కుడ్య చిత్రాల అందం చూడడం ఓ అపూర్వమైన అనుభవం. తనివితీరా చూస్తూ కొంత నోట్స్ కూడా రాసుకున్నాను. లావణ్య లతల్లాంటి స్త్రీల సౌందర్యంతో పాటు బోధిసత్త్వుని ఆధ్యాత్మిక సౌందర్యాన్ని రంగుల్లో సజీవింపచేసిన చిత్రాలు.

అంతటి అలౌకిక సౌందర్యాన్ని కళ్లతో జుర్రుకున్న మత్తులో . . . భుజానికి వేలాడుతున్న

గాంధీ సంచితో నాకే తెలీని విభ్రమంలో నడుస్తున్నాను. సంచీ పట్టుకుని ఎవరో లాగుతున్నారు. మైకంలోంచి బైటపడి చూద్దును కదా . . . బుడుగు అనబడే సూర్యకుమార్. నా సహాధ్యాయి.

"నువ్వెప్పుడొచ్చావిక్కడికి?" అతని భుజం మీద ఆప్యాయంగా నొక్కుతూ అన్నాను.

"ఆ ప్రశ్న అడగాల్సింది నేను. ఎందుకంటే ఉద్యోగరీత్యా నేనీవూళ్లోనే ఉంటున్నాను కాబట్టి"

ఎం.ఏ. హిస్టరీ ఇద్దరం కలిసి చదువుకున్నాం. సివిల్స్‌కి హైద్రాబాద్‌లో ఓ రూము తీసుకుని ప్రిపేరయినాం. చివరికలాంటి ఉద్యోగాలు రావని నిర్ధారణకువచ్చాక నేను లెక్చరర్‌గా సెటిలైనా. బుడుగు మరో రెండేళ్లు పోటీ పరీక్షలను పట్టుకుని వేలాడాడు. ఆ తర్వాత మా మధ్య అంతగా కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల అతని వివరాలు తెలీలేదు.

"ఇంతకూ ఏం ఉద్యోగం?"

"స్టేట్ బ్యాంక్‌లో ప్రొబేషనరీ ఆఫీసర్".

పట్టు వదలకుండా పోటీ పరీక్షలో నెగ్గుకొచ్చినందుకు అతన్ని మనసారా అభినందించాను.

మెల్లగా చీకట్లు అలుముకుంటున్నాయి. వాతావరణంలో ఏదో మార్పు . . . గాలి చల్లగా మొహానికి తగుల్తోంది.

"వేగంగా నడువ్. వర్షం వచ్చేట్లుంది. నా రూం ఇక్కడికి దగ్గిరే . . . రెండు ఫర్లాంగులు నడిస్తే చాలు" అన్నాడు.

తుంపర ప్రారంభమైంది. మేం పరుగులాంటి నడకతో దాన్ని ప్రతిఘటించే ప్రయత్నంలో పడ్డాం. వర్షం పెద్దదైంది. కుండపోత . . . రూంకెళ్లే లోపల ముద్దగా తడిసిపోయాం.

"అకాల వర్షం . . . ఎంత అనెక్స్‌పెక్టెడ్‌గా వచ్చిందో . . . నీలా" అంటూ నవ్వాడు.

"నేను ముంచెత్తనులే. మృదువుగా మట్టి పెదవుల్ని ముద్దాడి మురిసిపోయే చిరుజల్లులా మట్టి తడిలోని సువాసనల్ని విరజిమ్మి వెళ్లిపోతాన్లే"

"అబ్బ . . . ఎంత బాగా చెప్పావు. నీ కవిత్వం విని చాన్నాళ్లయింది. ఇంకా రాస్తున్నావా? ఉద్యోగ ఝంఝూటంలో పడి సున్నితమైన భావాలన్నీ వట్టిపోలేదుగా"

"గుండె నిండా కావల్సినంత తడి. కవిత్వమొక తీరని దాహమని కదా అన్నారు".

స్నానం చేసి, బట్టలు మార్చుకుని భోజనానికి హోటల్‌కి బయల్దేరాం.

కబుర్లు . . . మేం ఎం.ఏ. చదువుకునే రోజుల్నాటి కబుర్లు . . .

"మన వూర్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపితే ఇక్ష్వాకుల, శాతవాహనుల కాలం నాటి రాగి నాణేలు బైటపడ్డాయి గుర్తుందా? నువ్వు హిస్టరీ లెక్చరర్‌కి చెప్పి వాటిని పురావస్తు శాఖ వారికి అప్పగించేవరకు పెద్ద రాద్ధాంతమే చేశావు" అన్నాడు బుడుగు.

ఆ సంఘటన నేనెలా మర్చిపోగల్ను? మా వూరికి దక్షిణం వైపు విస్తారంగా గుట్టలున్నాయి. ఎర్రగుట్ట మీద పోలేరమ్మ గుడి ఉంది. చాలా యేళ్ల క్రితం అక్కడ పూజలు, జంతుబలుల్తో పాటు, నరబలులు కూడా జరిగేవని, వాటి రక్తంతో తడవడం వల్లే ఆ గుట్టంతా ఎర్రబడిందని ప్రతీతి. గుట్టను ఆనుకుని ఉన్న నర్సిరెడ్డి పొలంలో గుప్త నిధులున్నాయని పుకారు.

రాత్రిళ్లు రహస్యంగా పొలంలో తవ్వకాలు జరుగుతున్నాయని వూళ్లో గుస గుసలు . . . ఎవ్వరికీ అనుమానం రాకుండా మనమూ వెళ్లి చాటుగా ఉండి చూద్దామని బుడుగుతో అంటే 'అమ్మో. నాకు భయం. నర్సిరెడ్డి దుర్మార్గుడు' అన్నాడు. చారిత్రక అవశేషాలు దొరుకుతాయేమోనని నా ఆశ . . .

తవ్వకాలు అమావాస్య రాత్రుళ్లు లాంతర్ల వెలుగులో జరిగేవి. నేనొక్కడినే చాటుగా వెళ్లి తుప్పల్లో దాక్కొని నిరీక్షించేవాడిని. నిద్ర ఉండేది కాదు. రక్తాన్ని ఆబగా తాగేసే దోమలు . . .

నాలుగు అమావాస్యలు పోయాక ఆ రాత్రి తవ్వకాలు చేస్తున్నవాళ్లు నిధి దొరికిందంటూ పెద్దగా అరిచారు. లాంతర్లు చేతుల్లో పట్టుకుని గుండ్రంగా తిరుగుతూ నృత్యం చేశారు. ఇన్నాళ్లుగా మేపుతున్న మేకపోతుని లాక్కొచ్చి బలిచ్చారు. తీరా చూస్తే రెండు కుండల నిండా రాగి నాణేలున్నాయి.

మరునాడుదయం నేను నర్సిరెడ్డిని కలిసి ఆ నాణేల్ని ప్రభుత్వానికప్పగించాలని చెప్పాను.

నర్సిరెడ్డి అగ్గిమీద గుగ్గిలమైనాడు. 'అది నా పొలం. నా స్వంత పొలం. భూమే

కాదు అందులోని నిధి నిక్షేపాలన్నీ నాకే చెందుతాయి. ఏదో చదువుకుంటున్న కుర్రాడి పని పూర్కుంటున్నా. నా విషయంలో జోక్యం చేసుకోకు. నేనాట్టే మంచోణ్ణి కాదు' అంటూ బెదిరించాడు.

మా హిస్టరి లెక్చరర్‌కి చెప్పి హైద్రాబాద్‌లో ఉన్న పురావస్తు శాఖ వారికి విషయం చేరేలా చేశాను. వాళ్లు పోలీసుల్తో వచ్చి ఆ నాణేల్ని పురావస్తు శాఖకు తరలించేవరకు పూర్కోలేదు.

అదంతా ఇప్పుడు గుర్తుకొచ్చింది.

"చారిత్రక కట్టడాలు, పురాతత్వ వస్తువులు నిధినిక్షేపాల కన్నా విలువైనవని మనవాళ్లు ఎప్పటికి గుర్తిస్తారో? అవకాశం దొరికితే అమ్ముకుని సొమ్ము చేసుకోవాలన్న దురాశ తప్ప వాటిని భావి తరాల కోసం కాపాడాలన్న జ్ఞానం లేకపోవడం బాధాకరం" అన్నాను.

"మనకున్న అనంతమైన సాంస్కృతిక సంపద గురించి ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి కూడా ఉంది కదా" అన్నాడు బుడుగు.

"ఏమైనా మన వాళ్లకు చారిత్రక ప్రదేశాల్నీ, పురాతన కట్టడాల్నీ, శిల్పకళని, భిత్తిచిత్రాల్ని పరిరక్షించటంలో చాలా అశ్రద్ధ అనే విషయం ఇలాంటి స్థలాలకొచ్చిన ప్రతిసారీ రుజువవుతూ ఉంటుంది" అన్నాను.

అదంతా తల్చుకుని మనసంతా బాధ . . . అన్నం సయించలేదు. రూంకు తిరిగొచ్చాక అతను హాయిగా నిద్రపోయాడు. నాకు ఆలోచనలు తప్ప నిద్ర రాలేదు.

వాఘీరా . . . ఎంతందమైన పేరు ! పదో తరగతిలో ఉన్నప్పుడు నోరి నరసింహశాస్త్రి గారి వాఘీరా నవల చదివాను. ఎంత గొప్ప ప్రణయ కావ్యం ! వాఘీరా నదిని చూడాలని మనసు ఉవ్విళ్లూరేది. చూశాను. ఏముందక్కడ? మనుషుల్లో మృగ్యమైపోతున్న ప్రేమభావనలకు ప్రతీకగా చుక్కనీరు లేకుండా ఎండిపోయిన నది. రెండు కన్నీటిబొట్లతో వాఘీరా మట్టిని తడపడం తప్ప ఏం చేయగలిగాను?

అజంతా కుడ్య చిత్రాలు . . . క్రీస్తు పూర్వం రెండవ శతాబ్ది నుంచి క్రీస్తు శకం ఏడో శతాబ్ది వరకూ ఎంతో శ్రమకోర్చి వేసిన చిత్రాలు . . . హరిత వర్ణం కోసం ఆకు పసర్లని, నలుపు రంగు కోసం దీపం మసిని వాడి అంతందమైన చిత్రాల్ని భావి తరాలకందిస్తే మనం ఏం చేస్తున్నాం? వాటిని కొద్దికొద్దిగా నాశనం చేయడం తప్ప.

కళావిహీనంగా కన్పించిన వర్ణచిత్రాలు గుర్తొచ్చి మనసు వికలమైంది. ఔరంగాబాద్ నుండి వేసిన రహదారి వల్ల ఎంతటి కాలుష్యం . . . వాహనాల పొగ . . . మనుషుల తాకిడి . . . గుహల్లో ఏర్పాటు చేసిన లైట్ల కాంతి . . . వేడి . . . హైద్రాబాద్ నిజాం చేయించిన కెమికల్ ట్రీట్‌మెంట్ . . . అతని ఉద్దేశం మంచిదే. కాని అధికారుల్లోని అవగాహనాలోపం . . . వీటన్నిటికి తోడు ప్రభుత్వ నిర్లక్ష్యం . . . అజంతా చిత్రకళా సౌందర్యాన్ని కబళిస్తోన్న కాల సర్పాలు . . .

పురావస్తు శాఖ వారికి ఉత్తరం రాయాలనుకున్నాను. వెంటనే రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది.

నల్గొండ దగ్గరున్న ఫణిగిరిలో తవ్వకాలు జరపాల్సిందిగా పురావస్తుశాఖ వారిని లిఖితపూర్వకంగా కోరాను. ఆర్నెల్లు డజనుకి పైగా ఉత్తరాలు రాసి, విసిగిపోయి, కలెక్టర్ ద్వారా ఒత్తిడి తెచ్చాక తవ్వకాలు ప్రారంభమైనాయి.

ట్రయల్ ట్రెంచ్‌లో పాలరాతి మీద చెక్కిన ఇక్ష్వాకుల కాలం నాటి శాసనం దొరికింది. శాతవాహనుల కాలం నాటి మట్టి పాత్రలు దొరికాయి. ఓ పాత్ర మీద మూత త్రిభుజాకారంలో ఉంది. దాని మీద మనుషులు వలయాకారంలో మానవహారంగా నిలబడినట్టు ఉంది. చూడగానే చాలా అపురూపమైన పురాతత్వ సంపద అన్పించింది.

అక్కడి తవ్వకాల్లో దొరికిన వాటినన్నిటినీ పురావస్తు శాఖ వారు తీసుకెళ్లిపోయారు. కానీ ఆ మూత మాత్రం మధ్యలోనే మాయమైంది. నేనెంత పోరాడినా దాన్ని తిరిగి సాధించలేకపోయాను.

మన అపురూపమైన సంస్కృతిని అమ్మి సొమ్ము జేసుకోవడం ఎంత దారుణం !

మరునాడు బుడుగు బ్యాంక్‌కి వెళ్లాక నేను మరోసారి అజంతా గుహలు చూద్దామని వెళ్ళాను.

పెయింటింగ్స్ మీద వాటిని చెరపకుండానే పెయింటింగ్స్ వేయడం వల్ల మందం ఎక్కువై పెచ్చులుగా ఊడుతూ కొన్ని చోట్ల . . . మనుషులు తాక్కూడదని అద్దాల ఫ్రేముల్లో బిగించే ప్రయత్నంలో పెళ్లలుగా విరిగిన ఆనవాళ్లు మరికొన్ని చోట్ల . . . బుద్ధుని జాతక కథలు రంగుల మేళవింపులో మంద్రంగా గోడల మీద ప్రవహిస్తూ . . .

రామగిరిలో పెట్టిన బుద్ధుని ధాతువుల కోసం దాదాపు ఎనిమిదేళ్ళు జరిగిన యుద్ధాలు . . . ఇదీ మనం అహింసామూర్తికి అర్పించిన నివాళి !

"నీకో అద్భుతమైన వస్తువుని చూపించడం మర్చిపోయాను" అన్నాడు బుడుగు.

సాయం సమయం . . . వాతావరణం చల్లగా ఉంది. ఆకాశంలో అప్పుడప్పుడూ మెరుపులు . . . పెద్ద వర్షం పడేలా ఉంది.

"ఏంటది" నాలో ఉత్సుకత . . .

"చూస్తే నువ్వు థ్రిల్ అవుతావు తెలుసా?" అన్నాడు ఊరిస్తూ. సూట్‌కేస్ తెరిచి అందులో బట్టల అడుగునున్న వస్తువుని బైటికి తీశాడు. న్యూస్ పేపర్‌లో చుట్టిన వస్తువు . . .

"ఇది విప్పదీసి చూడు నీకే తెలుస్తుంది" అన్నాడు.

నాలో ఆత్రుత . . . దానికి కట్టి ఉన్న దారాన్ని విప్పదీసి పేపర్‌ని తొలగించాను.

నా చేతిలో ఒక అడుగు పొడవు, అరడుగు వెడల్పు ఉన్న రాతి ముక్క . . . దాని మీద రంగుల కలయిక . . . ఆశ్చర్యంగా చూశాను. కుడ్య చిత్రాల్లోంచి పెళ్లగించిన ముక్క . . .

అప్పటి వాఘీరా నదిలా నాలో పొంగుతూ కోపం. ఇప్పటి ఎండిన సైకత శరీరంలా నన్ను కుంగదీస్తూ దుఃఖం . . .

"ఎక్కడ దొరికింది?" కోపాన్ని అణుచుకుంటూ నేను.

"దొరకలేదు. కొన్నాను. ఇలా గోడల్నుంచి పెళ్లగించిన ముక్కల్ని కొంతమంది అమ్ముతుంటారు".

"నాకూ కొనాలని ఉంది. పద వెళ్దాం. ఎక్కడ దొరుకుతాయో చూపిద్దువు గాని" అన్నాను.

అతన్ని వెన్నంటే నేను . . . నిద్రలో నడుస్తున్నట్లు . . . దుఃఖమాంత్రికుడి వశమై . . . ప్రచండభానుడి తాపానికి మండుతున్న సైకత రేణువులా నా గుండె . . .

సందులు . . . మెలికల్లా తిరుగుతూ . . . వీధుల్లో అమ్మకానికి పెట్టిన రకరకాల బొమ్మలు . . . ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసినవి . . . నల్లరాతిలో చెక్కిన చిన్న విగ్రహాలు . . . పూసలు . . . రంగురంగుల రాళ్లు . . . గవ్వలు . . . వాటన్నిటినీ దాటుకుంటూ . . . సన్నటి దారుల్లో . . .

బుడుగు ఓ వ్యక్తిని చూసి ఆగాడు. అతను సిల్కు జుబ్బా వేసుకుని ఉన్నాడు. ట్రిమ్

చేసిన గడ్డం . . . వచ్చీ రాని ఇంగ్లీష్‌లో విదేశీ యువతితో మాట్లాడుతున్నాడు.

బుడుగు అతన్ని సమీపించి "అజంతా గోడల్నించి పగులగొట్టిన ముక్కలు కావాలి" అన్నాడు అతనికే విన్పించేంత సన్నగా.

"లేవు" సిల్కు జుబ్బా మరలా విదేశీ వనిత వైపు తిరిగి "ఇట్స్ చీప్ మామ్ . . . ఇన్ యువర్ కరెన్సీ ఇట్స్ ఓన్లీ ట్వంటీ డాలర్స్" అన్నాడు.

"నీ దగ్గర దొరుకుతాయని నాకు తెలుసు. రెణ్ణెల్ల క్రితం నీ దగ్గరే కొన్నాను" అన్నాడు బుడుగు.

అతడు చిరాగ్గా చూశాడు. "ఫారినర్స్ కమ్మితే గిట్టుబాటవుద్ది. మన వాళ్లంత ఇవ్వరు సార్" అన్నాడు. మరలా ఆమె వైపు తిరిగి "ఓకె. ఫర్ యూ ఫిఫ్టీన్ డాలర్స్ . . . సిక్స్ హండ్రెడ్ రూపీస్ ఓన్లీ" అన్నాడు.

"నువ్వడిగినంత ఇస్తాను" నేను కల్పించుకుంటూ అన్నాను.

"ఇక్కడే ఉండండి" అంటూ అతను ఎదురుగా ఉన్న దుకాణంలోకి వెళ్లి, కాగితంలో చుట్టి ఉన్న రాతి ముక్కని తెచ్చిచ్చాడు.

"వెయ్యి రూపాయలు . . . తగ్గేది లేదు".

"ఇప్పుడేగా తెల్ల దొరసానితో పదిహేను డాలర్లన్నావు. నేను కొన్నది వంద రూపాయలకే" అన్నాడు బుడుగు.

"నాకు తెలుసు మన ఇండియన్స్ గురించి. అందుకే లేవన్నాను" అతను నా చేతుల్లోంచి ఆ ముక్కని లాక్కోబోయాడు. రెండొందలకి బేరం కుదిరింది.

డబ్బులు ఇవ్వబోతూ ఆగి "ఇది ఒరిజినలేనా" అని అడిగా.

"ష్యూర్ సార్"

"మీకెలా వస్తాయి?"

"మా కుర్రోళ్లు టూరిస్టులతో పాటు లోపలకెళ్తారు. చీకటి పడ్డాక ఎక్కడో గుహల్లో దాక్కుంటారు. గార్డులు గేట్లు మూసేసి తాళాలు వేశాక వాల్ పెయింటింగ్స్ ఉన్న గుహల్లోకెళ్లి గోడల మధ్యలో సన్నటి మేకుల్ని కొట్టి కావల్సిన సైజులో ముక్కల్ని వూడగొడ్తారు. వాటిని బట్టల్లోపల దాచుకుని మరునాడు తిరిగొస్తారు" అన్నాడు.

వాణ్ణి అక్కడే పట్టుకుని చితకబాదాలన్నంత ఆవేశం . . . వాడి చర్మం లోపలికి సన్నటి మేకుల్ని దూర్చి పెళ్లగించాలన్నంత కసి . . .

మరలా నడక . . . వెనక్కి . . . వెనకెనక్కి . . . పాములా మెలికలు తిరిగిన సందులు. బుసలు కొడ్తున్న కోపం . . . నన్ను ఆక్రమిస్తూ . . .

"ఇటెక్కడికి? మన రూం అటు" అన్నాడు బుడుగు.

"పోలీస్ స్టేషన్‌కి."

"ఎందుకు?" ఆశ్చర్యంగా బుడుగు.

"కంప్లెయింట్ చేయడానికి".

"నీకేమైనా పిచ్చా? ఇవన్నీ వాళ్లకు తెలీకుండానే జరుగుతున్నాయనుకుంటున్నావా?"

"తెల్సి కూడా వాళ్లు వాళ్ల బాధ్యతల్ని సక్రమంగా నిర్వర్తించడం లేదు కాబట్టి వాటిని గుర్తు చేయాల్సిన అవసరం ఉంది".

"నా మాట విను. ఈ పోలీసుల్తో తలనొప్పి మనకెందుకు?"

"నా జాతి సొత్తయిన శిల్ప సంపదని, చిత్ర సంపదని ఇలా ముక్కలుగా పగులకొట్టి బజార్లో అమ్మడాన్ని నేను సహించలేను".

"సరే నీ ఇష్టం. నేను రాను. నన్ను మాత్రం దీన్లోకి లాగకు"

"నువ్వు కొన్నావు. వాడు అమ్మడం నేరమైతే నువ్వు కొనడం కూడా నేరమే. ఇలా జరుగుతోందని తెల్సి కూడా నీకేమీ సంబంధం లేనట్లు మిన్నకుండడం కూడా నేరమే".

"నువ్వూ కొన్నావుగా"

"కొన్నాను . . . సాక్ష్యం కోసం . . . వాడి ఆచూకీ తెల్సుకోవడం కోసం"

నేరుగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాను. ఎఫ్ఐఆర్ నమోదు చేసేవరకూ వదల్లేదు. ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లని వెంటబెట్టుకుని ఆ దుకాణానికి వెళ్లాను. పోలీసుల్ని చూసి గడ్డమతను పారిపోయాడు. దొరికిన రాతి ముక్కల్ని స్వాధీనం చేసుకున్నారు.

వాళ్లని పిల్చుకుని బుడుగు కోసం గదికెళ్లా. తాళం వేసి ఉంది.

రాత్రి పదయింది.

ఆకలి వేయడం లేదు. దుఃఖం కడుపు నిండా పేరుకుపోయి . . . బరువుగా . . . నడుచుకుంటూ వెళ్తున్నా . . . ఆకాశం నిర్మలంగా ఉంది. పైకి దుముకుతున్న పాపాయిలా పండంటి వెన్నెల . . .

రాళ్లగుట్టలు . . . విశాలమైన నల్లరాతి సమూహాలు . . . ఉలిని లాఘవంగా ఉపయోగించి అద్భుతమైన శిల్ప సౌందర్యాన్ని ఆవిష్కరించే శిల్పి కోసం తపస్సు చేస్తున్న మునిపుంగవుల్లా . . . మౌనంగా . . . ధ్యానంలో . . .

నిన్నటి వర్షానికి కడిగిన నీలమణుల్లా మెరుస్తూ . . .

ఓ రాతి మీద వెల్లకిలా పడుకున్నా. వెన్నెల పరదాల చాటున చంద్రుడు . . .

ఎప్పటికో నిద్ర పట్టింది.

కల . . .

అజంతా కుడ్య చిత్రాల్ని ముక్కలు చేసి రాశులు పోసి అమ్ముతున్నారు.

ఎల్లోరా శిల్పాల్ని పగులగొట్టి గంపల్లో పెట్టి తూకానికి విక్రయిస్తున్నారు.

ఎగబడి కొంటున్న విదేశీయులు . . . డాలర్లు కొరడాల్లా ఝుళిపిస్తున్న వాళ్ల వెనక బెరుగ్గా మనవాళ్ళు . . . రూపాయి నోట్లని విదిలిస్తూ . . .

చార్మినార్ . . . తాజ్‌మహల్ . . . ముక్కలుగా పగిలిన సౌందర్యం . . . విపణి వీధుల్లో అమ్మకానికి . . .

గడ్డంవాడు పెద్దగా అరుస్తున్నాడు "అద్భుతమైన ముక్కలు . . . సౌందర్య శకలాలు . . . కొనండి. వెరీ చీప్ . . . మీ కళా తృష్ణని తీర్చుకోండి. కోణార్క శిల్ప సంపద ముక్కల్లో . . . ఖజరహో శిల్పాల అందమైన ముక్కలు . . ." వాడి తోపుడు బండి మీద రకరకాల రాతి ముక్కలు.

మంటలు . . . ఎర్రగా . . . భూకంపాలు . . . కట్టడాలు కూలిపోతున్నాయి. శిల్పాలు ముక్కలుగా పగిలిపోతున్నాయి. చిత్రపటాలు కాలిపోతున్నాయి.

శిథిలాల్లో దేని కోసమో వెతుక్కుంటూ . . . ఏడుస్తూ నేను . . .

చప్పున మెలకువొచ్చింది. వళ్లంతా చెమటతో తడిసి ముద్దయి ఉంది.

తూర్పున ఉదయారుణ కిరణాలు.

నా దేశ సంస్కృతిని కాపాడుకోవడానికి నాలో ఊపిరులూదుకుంటూ ఉద్యమ బీజాలు . . .

(ఆదివారం ఆంధ్రజ్యోతి - 21 ఆగస్టు, 2005)